
www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 26 మే 2024

5

తిరుపతి



పులివర్తి నానిపై దాడి చేయలేదు : చెవిరెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్)



సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున, అనంతరం చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన దాడులలో చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై దాడిచేయలేదని, అతని కారును ధ్వంసం చేశారని మాజీ వైసిపి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం తుమ్మలగుంటలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో చెవిరెడ్డి మాట్లాడుతూ పోలింగ్ రోజు రాత్రి కూచివారిపల్లి, రామరెడ్డిపల్లి గ్రామాల్లో తన కుమారునిపై దాడిచేసి, వాహనాన్ని దగ్ధం చేసినప్పటికీ తన కార్యకర్తలు సంయమనం పాటించమని చెప్పానన్నారు. దఅసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

పాఠకులకు గమనిక

సాంకేతిక కారణాల వల్ల ఆదివారం 'స్నేహ' పుస్తకాన్ని అందించలేక పోతున్నాం. సోమవారం పత్రికతో పాటు అందించే ఏర్పాటు చేస్తాం.

- మేనేజర్

నిద్రపట్టని కాంట్రాక్టర్లు

'ఆరణి' లేఖ ఎఫెక్ట్

ఆగిన రూ.60 కోట్ల బిల్లులు



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జూన్ 4 కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.. అయితే కాంట్రాక్టర్లకు మాత్రం నిద్ర పట్టడం లేదు.. రాష్ట్రంలో అధికారంలోకి ఎవరొస్తారు..? తిరుపతిలో ఎవరు గెలుస్తారు? అనే టెన్షన్ వారికి నిద్ర రానీయడం లేదు. దాదాపు 60 కోట్ల రూపాయల బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది. ఇప్పటికే జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎన్నికల సమయంలో కార్పొరేషన్ కాంట్రాక్టర్ల బిల్లులను ఎటువంటి పరిస్థితుల్లో చెల్లించవద్దని కమిషనర్ అదితిసింగ్‌కు లేఖ రాశారు. కాదని ముందుకెళితే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. దీంతో వైసిపి హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల పరిస్థితి ఎలా ఉంటుందోనని కాంట్రాక్టర్లలో గుబులు నెలకొంది. ఆరణి శ్రీనివాసులు సైతం గతంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ అయి ఉండి, ఇలా చేయడం సబబు కాదని మున్సిపల్ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. సాటి కాంట్రాక్టర్ల సమస్య ఆరణికి పట్టలేదన్నది వారి ఆవేదన.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏడాదిగా కార్పొరేషన్ అధికారులు కాంట్రాక్టర్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఇక్కడ ఉన్న కమిషనర్ హరిత, ఇతర అధికారులు బదిలీ కావడంతో పనులు పూర్తయినా వీరికి బిల్లులు సకాలంలో ఇవ్వలేదు. అప్పులు చేసి వడ్డీలు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో మున్సిపల్ ఖజానా ఖాళీ అయ్యింది. కాంట్రాక్టర్లు ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి మరీ అభివృద్ధి పనులకు వెచ్చించారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ప్రతిరోజూ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పిల్లల పెళ్లిళ్లకు, ఆస్పత్రులకు సైతం కొంతమంది కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది దిగులుతో అనారోగ్యం పాలయ్యారు. ఈ నేపథ్యంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కమిషనర్‌కు లేఖ రాయడంతో అదితిసింగ్ సైతం బిల్లుల చెల్లింపుకు సాహసం చేయలేకపోయారని తెలుస్తోంది. కొంతమంది బడా కాంట్రాక్టర్లకు ఎంతోకొంత బిల్లులు ఇచ్చారని తెలుస్తోంది. చిన్నాచితక అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టిన కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు అందక మల్లగుల్లాలు పడుతున్నారు. శనివారం కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌ను కలిసి తమకు బిల్లులు చెల్లించాలని మొరపెట్టుకున్నారు. అవకాశాలను పరిశీలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

మా దగ్గరే కొనాలి..!



పుస్తకాలు, నోట్స్‌లపై 'ప్రైవేటు' హుకుం

యూనిఫాం, బెల్ట్, బ్యాడ్జీలపైనా ఆదేశాలు

వేలకు వేలు దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ

ఓ ప్రైవేట్ స్కూల్లో స్టేషనరీ ధరలు ఇలా..

యూనిఫాం (ఒక జత)	రూ.1500 - 3000
బెల్ట్	రూ.150 - 200
టై	రూ.100 -150
బ్యాగు	రూ.700 -1500
లంచ్‌బాక్స్	రూ.200 - 450
షూస్	రూ.500 -1250
టెక్ట్స్, నోట్ బుక్స్	రూ.3000 - 10000

ప్రజాశక్తి- తిరుపతి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. గుర్తింపు పొందిన పాఠశాలల్లోనూ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఈవో కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. ఇక నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు గంపగుత్తగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విద్యార్థుల తల్లిదండ్రులను నగదు వసూలు చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు ధరలను వసూలు చేస్తున్నా, విద్యాశాఖ అధికారులు మాత్రం నోరుమెదపకపోవడంలో ఆంతర్యమేంటని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అలాగే నిబంధలకు విరుద్ధంగా యూనిపాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూలను తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తుండటం గమనార్హం.

తమ పిల్లల భవిష్యత్ బాగుండాలన్న ఒకేఒక్క తల్లిదండ్రుల కోరిక కార్పొరేట్ పాఠశాలలకు కల్పతరువుగా మారుతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నారు. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్ , స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాదిరూపాయలు వసూలు చేస్తున్న యాజమన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ అంటూ అందినకాడికి దోచుకుంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1080 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 559 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మిగిలినవన్నీ ప్రైవేటు యాజమాన్యాల అధీనంలో ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. మౌలిక వసతుల లేమి.., విద్యార్థులకు సరిపడా ఆటస్థలాల కొరత, తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా.. ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడి అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా.. గరిష్ఠంగా రూ.1500 మించి ఉండదు. అన్ని కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కేజీ, యుకేజీ తరగతులకే రూ.3 వేలు వసూలు చేస్తుండగా, పెద్ద తరగతులకు రూ.8 వేలు నుంచి రూ 10 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు.

వారు అడిగినంతా ఇవ్వక తప్పదు : కుంట్రపాకం శిల్ప, తిరుపతి

'నాకు ఇద్దరు పిల్లలు. మా అక్కకూ ఇద్దరు. మా పిన్నికి ఒకరు. మొత్తం మా ఇంట్లోనే ఐదుగురు పిల్లలున్నారు. ఇద్దరు పిల్లలు ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్నారు. ఒకరు మూడో తరగతి, మరొకరు రెండవ తరగతి చదువుతున్నారు. ఇంకొకరు 9 వతరగతి. వీరంతా భవానినగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. ఒక్కొక్కరికి సగటున స్టేషనరీ ఫీజులే దాదాపుగా 13వేలు అవుతోంది. బహిరంగ మార్కెట్లో లభించే ధరతో పోలిస్తే ఇక్కడ మూడు రెట్లు ఎక్కువే. అయినా తప్పదు.

శ్రీకాళహస్తిలో కోడ్ ఉల్లం'ఘనులు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సాధారణ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికారులు కోడ్ ఉల్లంఘనలపై నిఘా పెట్టారు. కేసులు కూడా నమోదు అవుతున్నాయి. అయితే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో మాత్రం ప్రతిరోజూ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. ఆలయ ఇఓగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఉన్నారు. సుదీర్ఘకాలం రెవెన్యూలో పనిచేశారు. ఎన్నికల నిర్వహణ కార్యక్రమాలు చేపట్టిన అనుభవం కూడా ఉంది. ఎన్నికల కోడ్ గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. అయినా ఉల్లంఘన కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో నాయకులు పాల్గొనకూడదు. నాయకులతో కలిసి ఇఓ కూడా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బోర్డు కార్యాలయానికి రావడం, అధికారులు, సిబ్బందితో చర్చించడం, పనులు పరిశీలించడం, ప్రారంభోత్సవాలు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందా లేదా అనేది ఎన్నికల అధికారులు తేల్చాల్సి ఉంది. రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో స్థానికంగానే ఉన్నారు. ప్రతిరోజు పత్రికల్లో, టీవీల్లో నాయకులు పాల్గొన్న కార్యక్రమాలు వస్తూనే ఉన్నాయి. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందా లేదా అనేది రిటర్నింగ్ అధికారి స్పష్టం చేయాల్సి ఉంది.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఏపీ డిప్యూటీ సీఎం బోడి ముత్యాలనాయుడు, ఏపీ మంత్రి మెరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు బ్రిజేంద్రనాథ్ రెడ్డి, అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వంశీకష్ణ యాదవ్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసులు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా...ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలైన్లు కొనసాగుతున్నాయి. వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. గత 10 రోజుల్లో శ్రీవారి మెట్టు, అలిపిరి నడక మార్గాల్లో దాదాపు 2.60 లక్షల మంది భక్తులు తిరుమలకు చేరుకొని శ్రీవారిని దర్శించుకున్నారు. మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తతమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం అక్టోపస్ భవనం నుండి శిలాతోరణం వరకు ప్రత్యేకంగా 8 బస్సులు ఏర్పాటు చేసి ప్రతి నిమిషానికి భక్తులను చేరవేసేలా చర్యలు తీసుకున్నారు.

మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే మధ్యాహ్నానికి దాదాపు 60 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 50 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. సాధారణం కంటే రెట్టింపుగా అన్న ప్రసాదాలు అందించారు. అంతే కాకుండా పిల్లలకు పాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు.క్యూ లైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు.శనివారం సాయంత్రం 5 గంటల వరకు 46,486 మంది యాత్రికులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్య శాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూ లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



ఉచిత బస్సుల ద్వారా భక్తుల తరలింపు

హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం పరిశోధక విద్యార్థి కె. హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆచార్యులు డా. డి.గౌరీ శంకర్ రెడ్డి మార్గదర్శకత్వంలో 'అనాలసిస్ ఆఫ్ మోడీఫైడ్ వాటర్ ఇండిసెస్ ఫర్ సర్ఫేస్ వాటర్ డిటెక్షన్ ఇన్ ల్యాండ్ సాట్ - 8 ఇమేజరీ' అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ డిగ్రీ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాది ఈశ్వరయ్యను పరామర్శించిన 'ఆరణి '

ప్రజాశక్తి - తిరుపతి సిటీ


నాలుగు రోజుల కిందట రేణిగుంట రోడ్డులోని హోండా షో రూం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో న్యాయవాది ఈశ్వరయ్య ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఈశ్వరయ్యకు తీవ్ర గాయాల పాలవడంతో నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం ఈశ్వరయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు దినకర్ , కంచి ప్రవీణ్ కుమార్, లగిశెట్టి వెంకటరమణ, గాలి శ్రీనివాసులు, అప్పిలి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ బాధితునికి నగదు రిఫండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందిన కేవలం 20 నిమిషాల్లోనే స్పందించి రూ.1,42,545 లను బాధితునికి రీఫండ్ చేయించి న్యాయం చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సైబర్ పోలీసుల కథనం మేరకు... తిరుపతి లో కాపురముంటున్న రాజు తిరుమల లో విధులు నిర్వర్తిస్తున్నారు. 24వ తేది ఉదయం 11 గంటల ప్రాంతంలో 'ఇండసింది కస్టమర్ కేర్ నుండి ఫోన్ చేస్తున్నాము... మీరు కెవైసి అప్‌డేట్ చేసుకోవాలి, లేకపోతే మీ క్రెడిట్ కార్డు ఎక్స్‌పైర్డ్ అవుతుంది' అని చెప్పి, మీకు వచ్చిన ఓటీపీని చెప్పమన్నారు. అది నమ్మి అతను వెంటనే ఆలస్యం చేయకుండా ఓటీపీ చెప్పడంతో అతని క్రెడిట్ కార్డు నుండి రూ. 1,42,545 డెబిట్ అయ్యింది. అతను దిక్కుతోచని పరిస్థితులలో పోలీస్ గ్రౌండ్‌లో ఉన్న సైబర్ క్రైమ్ ఆఫీస్ కి వచ్చి జరిగిన విషయం అంతటిని సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్‌కు వివరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశం మేరకు వెంటనే సైబర్ క్రైమ్ టీంను, అప్రమత్తం చేసి వెంటనే ఎన్ సిఆర్ పిలో కంప్లైంట్ రైజ్ చేసి, హౌసింగ్ .కామ్ నోడల్ ఆఫీస్ కి నోటీసును, మెయిల్ ద్వార సర్వ్ చేసి పర్సనల్ గా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఫోన్లో సంబంధించిన నోడల్ ఆఫీసర్స్ తో మాట్లాడి ఫ్రాడస్టర్ బుక్ చేసిన ఆర్డర్స్ అన్ని కాన్సిల్ చేసి బాధితుని క్రెడిట్ కార్డుకి రూ.1,42,545/- అమౌంట్ ను 20 నిముషాల లోపల రిఫండ్ అయ్యేలా చేసి న్యాయం చేశారు. ఈ కేసును 20 నిమిషాల పరిష్కరించిన క్రైమ్స్ బందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

రాబోయేది కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వమే : చింతామోహన్



ప్రజాశక్తి - గూడూరు టౌన్

రాష్ట్రంలో, కేంద్రంలో వైసిపి , బిజెపి పార్టీలకు అనుకూల పరిస్థితులు లేవని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతామోహన్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను అనేక విధాలుగా ప్రభావితం చేశారని, అయితే విజ్ఞతతో ఓటర్లు ఓటు వేశారని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వెంటనే దుగరాజపట్నం పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ రామకష్ణారావు, పూల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో' తెలుగు విద్యార్థులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సాంసంగ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులోని మహాత్మా గాంధీ ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ లో ఇంజనీరింగ్ విద్యార్థులచే సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విద్యార్థులు హాజరై తమ ప్రతిభ పాటవాలను చాటారు. ఈ కార్యక్రమానికి టెక్నాలజీ ఔత్సాహితుడు రాబిన్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో అనే కార్యక్రమం జాతీయ విద్య, ఆవిష్కరణల పోటీకి సంబంధించినది. ఇది దేశంలోనే తరవాత తరాలను వినూత్న ఆలోచనలతో, సమస్య పరిష్కారానికి సంబంధించిన లక్ష్యంతో ఏర్పాటు చేసింది. ఇందులో తెలుగు విద్యార్థులు ముందుకు వచ్చి డ్రోన్ టెక్నాలజీ ద్వారా సముద్ర సంరక్షణ, వ్యర్థాల నివారణ వంటి వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి, తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. తమ ఆలోచనలు కార్యరూపం దాల్చడంలో మార్గ నిర్దేశం చేయగల, మద్దతు ఇవ్వగల, ప్రజా జీవితాలను మార్చడంలో సాయపడే సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమం ఓ వేదిక లాంటిది అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను యువత సభ్యులుగా చేసుకొని మరింత ముందుకెళ్లాలని కోరారు.

'కౌటిల్య' విద్యార్థులకు ఐఐఎం అడ్మిషన్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద వున్న 'కౌటిల్య ఇన్స్టిట్యూషన్' సంస్థ కి చెందిన 8 మంది క్యాట్ విద్యార్థులకు ఈ వారం లో విడుదల చేసిన తుది ఫలితాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అత్యంత ప్రతిష్టాత్మక కాలేజీ లు - ఐ.ఐ.ఎం లలో, మరో 10 మందికి పైగా విద్యార్థులకు ఇండియా లోని టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ సాధించారు. శ్రీధర్ మాట్లడుతూ 'ముందున్నవాళ్లకు ముందే అవకాశాలు దొరుకుతాయి ' అనే సామెత ఈ క్యాట్ లో చాలా బాగా పని చేస్తుంది. అంటే విద్యార్థులు తమ డిగ్రీ / లేదా బి.టెక్ చదువుతున్నప్పుడే తమ ఖాళీ సమయాన్ని ఈ ఐ.ఐ.ఎమ్ లో అడ్మిషన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఉచిత గైడెన్స్‌కు కౌటిల్య సంస్థను 9698123456 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.



జాతరో..జాతర..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా గడిచిన 15 రోజుల్లో రెండు జాతర్లు వచ్చాయి. ఒకటి ఎన్నికల జాతర కాగా, మరొకటి తాతయ్యగుంట గంగమ్మ జాతర. ఒకటి నెల రోజుల పాటు ఊరు..వాడా మార్మోగగా, మరొకటి వారం రోజుల పాటు వీధి వీధిన పూజలతో సాగింది. ఒకటి రంగులతో వివిద రకాల వేషధారణలతో వాడ వాడల తిరుగుతూ మొక్కులు తీర్చుకోగా, మరొకటి రాజకీయ రంగులు మార్చుతూ ప్రజలను మెప్పించేందుకు రకరకాల వేషాలు వేయాల్సి వచ్చింది. ఒక జాతర చెడుపై మంచి గెలుపుకు సాక్ష్యం కాగా, మరో జాతర బూర్జువా రాజకీయ మేథావుల పెత్తనానికి గెలుపే మార్గంగా నిలవడం గమనార్హం.

తిరుపతి ఆధ్యాత్మికమే కాదు, టూరిజానికి నెలవు. అంతేకాదు విద్యా, వైద్య హబ్‌గా ప్రసిద్ధికెక్కింది. దాదాపు 70 కిలోమీటర్ల మేర సాగరతీరం గల జిల్లా. విదేశీ పక్షులకు ఆవాసంగా నిలుస్తోంది. కొండలు, గుట్టలు, జలపాతాలతో ప్రకృతి అందాలన్నీ పునికిపుచ్చుకుంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ జిల్లాలో తాతయ్యగుంట గంగమ్మ జాతర అతిపెద్ద వేడుకల్లో ఒకటి. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తర్వాత అతిపెద్ద ఉత్సవం. వారం రోజుల పాటు జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. తిరుపతి గంగమ్మకు పుట్టిన ఊరైన తిరుపతి రూరల్‌లోని అవిలాల ఊరులో జాతర నెలలో వచ్చే రెండో మంగళవారం జాతర చాటింపు చేపడతారు. ఎన్నికల నిర్వహణలో తలమునకలైన అధికార యంత్రాంగం, తాము బందోబస్తు కల్పించలేమని చేతులెత్తేయడంతో జాతరను వాయిదా వేశారు. ఈ నెల 13న ఎన్నికలు ముగియడంతో 14వ తేది నుంచి 22 వ తేది వరకు తిరుపతి గంగమ్మజాతరను నిర్వహించారు. ప్రతి రోజూ భక్తులు, తిరుపతి వాసులు బండ, బైరాగి, తోటి, మాతంగి, దొర, సున్నపు కుండలు వేషాలతో పాటు సప్పరాలు, రకరకాల వేషధారణలతో వీధుల్లో తిరుగుతూ, అమ్మవారిని సంతృప్తి పరిచేందుకు పలు రకాల బూతులు తిడుతూ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం జాతర రోజు అమ్మవారికి అభిషేకం చేసి, పొంగళ్లు పెట్టి, పొటేళ్లు, కోళ్లు, మేకలు, దున్నపోతులు బలి ఇచ్చారు. బుధవారం వేకువజామున అమ్మవారు విశ్వరూప దర్శనాన్ని వీక్షించేందుకు లక్షలాది మంది తరలివచ్చారు. పేరంట్రాలు రాకతో అమ్మవారి విశ్వరూపాన్ని తీసేయడంతో జాతర ముగిసింది. ఈ జాతర తీరు జిల్లా వాసులందరికీ ఎరుకే.

దీనికి ముందు నెల రోజుల పాటు ఎన్నికల జాతర జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఒక పార్లమెంట్ స్థానం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 18 లక్షల మంది ఓటర్లు ఉండగా 265 మంది అభ్యర్థులు ఎంపి, ఎంఎల్ఏ పదవుల కోసం పోటీ పడ్డారు. బూర్జువా రాజకీయ పార్టీలన్నీ ప్రతి రోజూ ప్రచారం హోరెత్తించారు. ఎపుడూ ప్రజా సమస్యలు పట్టని అభ్యర్థులు వీధిబాటపట్టారు. టీ అంగళ్లు దూరి టీ పోయడం, టిఫన్ అంగట్లో దోశలు వేయడం, కూలీలతో కలిసి బరువులు మోయడం, ఐస్‌లు అమ్మడం, కొబ్బరిబోండాలు కొట్టడం, పండ్లు అమ్మడం, బట్టలు ఉతకడం, షాపుల్లో చెప్పులు ఇతరాత్రవి విక్రయించడం. అబ్బో ఒకటేంటి రకరకాల వేశాలు వేశారు. ప్రజల ఓట్లు కోసం అనేక ప్రలోబాలకు దిగారు. ఓటుకు వేల రూపాయలు పంచారు. బెదిరించారు. బుజ్జగించారు. భయపెట్టారు. అవసరమైతే కొట్టారు. దాడులు చేశారు. ప్రత్యార్థుల ఎత్తులకు పై ఎత్తులు వేశారు. తమ తమ అంగబలం, ఆర్థిక బలాన్ని చూపించారు. అధికార యంత్రాంగాన్ని వాడుకున్నారు. వ్యవస్థలను ప్రలోభాలకు గురిచేశారు. ఇంతచేసినా ఓటర్లు ఎవ్వరు ఏ వైపు నిలబడ్డారు అనేది మాత్రం జూన్ 4న తెలుస్తుంది. గడిచిన 15రోజుల్లో జిల్లాలో రెండు జాతర్లు ముగిశాయి.

విద్యా కానుక కిట్ల పరిశీలన


విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న డివైఇవో ప్రభాకర్‌రాజు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు విద్యా కానుక కిట్లను , నోట్ పుస్తకాలను శనివారం పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో విద్యా కానుక కిట్లను అందించాలని పాఠశాల పున: ప్రారంభం రోజే ప్రతి విద్యార్థికీ విద్యా కానుక కిట్లను నోట్ బుక్స్‌ను అందిం చాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏ విద్యార్థికీ విద్యా కానుకలు అందలేదని ఫిర్యాదు రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు.

రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్, రొటేరియన్ (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో గుడూరు పట్టణం గమళ్లపాలెం ఓం సాయిరాం వసతి గృహంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ 'మా అమ్మ' ద్వారా ఈ వృద్ధాశ్రమానికి వచ్చి అన్నదానం ప్రారంభించి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి, రామ్మోహన్, బలరాం రెడ్డి, కేర్ టేకర్ కళ్యాణి పాల్గొన్నారు.

పోలీసుల మాక్ డ్రిల్


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి)శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం అయితే అల్లరి మూకను ఎలా అదుపు చేస్తూ చెదర గొట్టాలో తెలుపుతూ చంద్రగిరి టవర్ క్లాక్ కూడలి వద్ద ఎస్పి వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు శాంతి భద్రతల అదనపు ఎస్పి కులశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు శనివారం మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల అదనపు ఎస్పి కులశేఖర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి పోలీసులు ఇప్పటి నుండే సమాయత్తం అయ్యారనే సందేశాన్ని జిల్లా ప్రజలకు ఈ మాక్ డ్రిల్ ద్వారా తెలుపుతున్నామన్నారు. కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల నిబంధనలు అమలులో వుంటాయని, సెక్షన్ 144 సి ఆర్‌పిసి, సెక్షన్ 30 పోలీస్ చట్టం అమలులో ఉంటుందని ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి హింసాత్మక చర్యలకు పాల్పడితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో ప్రజలకు తెలిపేందుకు మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. కౌంటింగ్ రోజు అందరూ క్రమశిక్షణతో మెలిగి పోలీసులకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లను అవసరమైన మేరకు బైండోవర్, హౌస్ అరెస్ట్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు శరత్ రాజ్ కుమార్, రవీంద్రారెడ్డి, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పులివర్తి నానికి పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ నేతల దాడిలో గాయపడి చికిత్స అనంతరం తిరుపతిలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి కూటమి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని తొట్టంబేడు మండల టిడిపి నేతలు శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పులివర్తి నాని త్వరగా కోలుకోవాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళీనాయుడు, రాఘవులు, రాజా, రూప్ చౌదరి, హరి, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

పిల్లల భద్రత తల్లిదండ్రులదే: జడ్జి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పిల్లల భద్రతపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర తెలి పారు. శనివారం ఆయన అంత ర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా బాలలకు ప్రత్యేక హక్కులు ఉన్నా యని, వారి సంరక్షణకు చట్టాలు ఉన్నాయని తప్పిపోయిన పిల్లల కోసం సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని, తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ వన్ 1098 కి ఫోన్ చేసి వివరాలు అందించాలన్నారు. ప్రభుత్వ సంరక్షణ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. వివిధ కారణాలతో పిల్లలు ఇల్లు వదిలి వెళ్లే పరిస్థితిని తల్లిదండ్రులు కల్పించ వద్దని తెలిపారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో పట్టణ పురవీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు రథోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


పాదయాత్ర నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి- రేణిగుంట:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి టిడిపి కూటమి కూటమి నాయకత్వం అభ్యర్థులు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ, శ్రీకాళహస్తి నియోజక వర్గంలో బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని రేణిగుంట మండల నాయకులు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ దైవం ఆశీస్సులు కావాలని కోరుకుంటూ రేణిగుంట లోని మేరీ మాత , చర్చి నుండి సూళ్లూరుపేట చెంగాలమ్మ గుడిని, వేనాడు దర్గా వరకు పాదయాత్ర శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ సైకో జగన్ పాలన రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయాలు జరిగాయని తెలిపారు. .రాబోయే టిడిపి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెన్నన్ రెడ్డి, కిరణ్ కుమార్, దినేష్, తేజ, జగదీష్ పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి , క్లస్టర్ ఇన్‌ఛార్జి పుష్ప నాదం, టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మునస్వామి నాయుడు మునికృష్ణ వారికి సంఘీభావం తెలిపారు.

ఉచిత చదరంగ శిక్షణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

పట్టణంలోని కొత్తపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 5–15ఏళ్లు మధ్య వయసు గల బాల బాలిక లకు ది చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత చదరంగ శిక్షణా తరగతులు ప్రారంభించారు. నిర్వాహకులు అంజూరు బాలసుబ్రమణ్యం, సురేష్‌లు ఈ తరగతులను ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న అపార మేధస్సును వెలికి తీసి చెస్ ఛాంపియన్లుగా తీర్చి దిద్దడమే ఈ తరగతుల ముఖ్య లక్ష్యమని వారు తెలిపారు. అసాంఘిక శక్తులను అణచివేయడమే పోలీసుల లక్ష్యం అని అడిషనల్ ఎస్పీ కులశేఖర్ పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో వాహనాలు స్వాధీనం


దొరవారిసత్రంలో

ప్రజాశక్తి -దొరవారిసత్రం: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొరవారిసత్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏకొల్లు గ్రామంలో శనివారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ తనిఖీలో నాయుడుపేట రూరల్ సిఐ జగన్మోహన్ రావు, పెళ్లకూరు ఎస్ఐ శ్రీకాంత్, దొరవారిసత్రం ఎస్ఐ తిరుమల రావు, ఏఎస్ఐ శ్రీనివాసులు సారథ్యంలో ఏకొల్లు గ్రామంలోని ప్రతి గృహంలో వాహనాలను తనిఖీ చేసి, వాహనాలకు ఏ ఆధారాలు చూపించని సుమారు 20 స్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన రికార్డులను చూపించడంతో రికార్డులను చూపించిన వాహనాలను వాహనదారులకు అప్పగించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను చూపించని వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఈ వాహనాలకు రికార్డులను చూపించి తీసుకెళ్లాలని సూచించారు. రూరల్ సీఐ జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు వాహనాల కొనుగోలు,హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి వాటిపై పలు సూచనలు చేశారు. మైనర్‌లు డ్రైవింగ్ చేయకుండా, అతి వేగంతో వెళ్లకుండా, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి అనర్థాలతో జరిగే పలు ప్రమాదాలపై అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. ప్రతి వాహనానికి అవసరమైన పత్రాలు, వాహన చోదకునికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు ధ్రువీకరణ పత్రాలను చూపించి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు చక్రాల సైకిళ్ల వితరణ


మూడు చక్రాల జైకిళ్లను వితరణ చేస్తున్న ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ

ప్రజాశక్తి- రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో రేణిగుంట మండలంలోని తూకివాక గ్రామంలోని ఎం.బాలయ్య అనే ప్రత్యేక ప్రతిభావంతుడికి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ సుధాకర్ ఆర్థిక సాయంతో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిళ్లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ సమాజంలో ఉండే వాళ్ళు సహాయం చేస్తే పేదవారు అనేవారు ఉండరని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవ చేసే గుణాన్ని అలవరుచుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవ చేసేందుకు ఆషా సంస్థ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు తమ వంతు సేవ చేసే ఆలోచన ఉండి చేయలేని వాళ్లు ఆషా సంస్థ ద్వారా చేయొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆషా సంస్థ కమిటీ సభ్యులు రమేష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బలంగా వైసీపీ వ్యతిరేక పవనాలు

- వైసిపి , ఎన్‌డిఏ కూటమి అభ్యర్థులకు అధికారులు దాసోహం - మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వెల్లడి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతా మోహన్

ప్రజాశక్తి- వెంకటగిరి: రాష్ట్రంలో అధికార వైసిపికి వ్యతిరేక పవనాలు బలంగా వీచాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా పోస్టల్ బ్యాలెట్ లో 90 శాతం పైగా వైసీపీకి వ్యతిరేకంగా పడ్డాయని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ తెలిపారు. శనివారం స్థానిక పోలేరమ్మ ఆర్చి సెంటర్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. వైసిపి, ఎన్డీఏ కూటమి అభ్యర్థులు యథేచ్ఛగా నగదు మద్యం పంచుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంకు మామూళ్ల మత్తే కారణమన్నారు. ఎన్నికల కమిషన్ నరేంద్ర మోడీ జేబు సంస్థగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీకి వ్యతిరేకంగా, కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా ఓటర్లు నిలిచారన్నారు. తిరుపతి రాష్ట్ర రాజధానిగా అన్ని విధాలుగా అనుకూలమని, ఇప్పటికే అన్ని పార్టీలను కలిసి తిరుపతిని రాజధాని గా చేయాలని కోరుతానన్నారు. అమరావతి , విశాఖ లకు మించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు తిరుపతి అనుకూలమన్నారు.

పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఏకపక్షంగా అభ్యర్థులను ఎంపిక చేయటం తోనే కాంగ్రెస్ రాష్ట్రంలో నష్టపోయిందని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ ఆరోపించారు. ఇందిరా గాంధీ తీసుకు వచ్చిన భూ సంస్కరణల ఫలితంగా పేదలు బాగుపడ్డారని, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలర్పించారని వారిని విస్మరించి, తాను వైయస్సార్ బిడ్డని, బాబాయ్ ని హత్య చేశారని పదేపదే మాట్లాడటం ఏమిటన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక వసంతోత్సవాలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు మే 27 నుండి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లు ఆలయం నుండి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ హనుమాన్ సమేత శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివార్ల ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి వేదపండితులు శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామి అనుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థం. కాగా, రెండో రోజు మే 28వ తేదీ సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజలసేవ, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు(ఇద్దరు) ఒక రోజుకు రూ.516 చెల్లించి ఈ వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందిస్తారు.

ఆర్జిత సేవలు రద్దు

వసంతోత్సవాల సందర్భంగా మే 27 నుండి 29వ తేదీ వరకు కళ్యాణోత్సవం, మే 28న స్వర్ణపుష్పార్చన, మే 29న అష్టోత్తర శతకలశాభిషేకం, ఆర్జితసేవలను టిటిడి రద్దు చేసింది. ఈ సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జూబిలేషన్ వేడుకలు



మాట్లాడుతున్న అతిథి బుద్ధ చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో జూబిలేషన్ 2 కే 24 వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బుద్ధా చంద్రశేఖర్, కోఆర్డినేటర్ ఆఫీసర్ ఏఐసిటిఈ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విచ్చేశారు. వీరితో పాటు కళాశాల చైర్మన్ అశోక్ రాజు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బుద్ధా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడులను అధిగమించి నూతన ఉత్సాహంతో ముందుకెళతారని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. ఛైర్మన్ అశోక్ రాజు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ తో పాటు జూబిలేషన్ వేడుకలను జరపడం వల్ల ఫైనలియర్ విద్యార్థులు పాల్గొని ఉత్సాహం పొందుతారన్నారు. హీరోయిన్ డింపుల్ హయతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ కళాశాల జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని, సిద్ధార్థ విద్యార్థులకు క్రమశిక్షణ పరంగా, విద్యాపరంగా చురుగ్గా ఉన్నారని కితాబిచ్చారు. యాంకర్ ఐశ్వర్య తమ వాక్చాతుర్యంతో విద్యార్థులను అలరించారు. తొలుత స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విద్యార్థులకు, అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్, షాట్ పుట్, త్రో బాల్, టెన్నికాయిట్ తదితర వాటిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ ద్వితీయ బహుమతులు, కప్, మెడల్స్ అందించారు. తద్వారా ఆకడమిక్స్‌లో టాపర్ గా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందించారు. తద్వారా సిస్టెట్ కళాశాల నుంచి బీటెక్ తరపున బెస్ట్ అనూష (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), డిప్లమా బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ రేవంత్(ఈసీఈ), సైటెక్ కళాశాల నుండి బీటెక్ బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ గా బెస్తల మాధురి (ఈసీఈ), డిప్లమా బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ గా మహేష్(ఈసీఈ) ముఖ్య అతిథి చేతుల మీదుగా సర్టిఫికెట్లతో పాటు 50 వేల రూపాయలు విలువచేసే ట్యాబ్లు అందుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను అలరించాయి. ఈ జూబిలేషన్ వేడుకల్లో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్దన్ రాజు, రమేష్, టాక్ రైడర్ బ్యాండ్ బృందం, హెచ్ ఓ డి లు, పి ఎస్ రాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ విజయ భాస్కర్, గోపి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ప్రారంభం కానున్న పోలేరమ్మ జాతర

ఈవో వింత ధోరణిపై విమర్శలు

ప్రజాశక్తి -నాయుడుపేట:

నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ 49వ జాతర మహోత్సవం ఆదివారం ఘటంతో ప్రారంభించనున్నారు. నాయుడుపేట లో ఏటా జరిగే కార్యక్రమాల్లో పోలేరమ్మ జాతర ఎంతో ప్రాముఖ్యమైంది. ఈ జాతరకు నాయుడుపేట చుట్టుపక్కల మండలాల నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి, పక్క రాష్ట్రం తమిళనాడు నుంచి సైతం భక్తులు వేల సంఖ్యలో హాజరవుతుంటారు. మూడు రోజులు పాటు జరిగే జాతరను నాయుడుపేట ప్రజలు అంకిత భావంతో ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. భారీ స్థాయిలో జరిగే ఈ జాతరకు ట్రస్టు ఆధ్వర్యంలో ఈవో బాధ్యతలు వహించి జరిపించాల్సి వుంది. కార్యక్రమం వివరాలు, ప్రజలకు మీడియా ద్వారా వెల్లడించాల్సిన ఈవో శశాంక్ నియంత ధోరణి అవలంబిస్తున్నాడని స్థానికులు వాపోతున్నారు. జాతరకు ముందు అమ్మవారి హుండీ తెరచి మీడియా సమక్షంలో లెక్కింపు లెక్కించడం హుండీ లెక్కలు మీడియా ద్వారా ప్రజలకు తెలపాల్సి వుంది. కానీ ఈవో శశాంక్ ఈ లెక్కలేవీ మీడియాకు తెలియకుండా జాగ్రత్త వహించడంలో అర్థం ఏమిటో వివరించాలి. జాతర కార్యక్రమం వివరాలు మీడియా ద్వారా ప్రజలకు చెప్పాల్సిన ఈవో ఇప్పటివరకు మీడియా సమావేశం ఏర్పాటు చేయకపోవడంలో ఆయన విధానం ఏమిటో ఎవరికి ఎంత చిక్కటం లేదు. జాతరలో ఏ ఏ కార్యక్రమాలు చేపడుతున్నారు? ఎంత వెచ్చిస్తున్నారు అనే విషయాలు ఇప్పటి వరకు మీడియాకు తెలపకపోవడం గమనార్హం. కార్యక్రమ వివరాలు తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులు ఆయన కోసం ఎంత ప్రయత్నించినా ఆయన స్పందించకపోవడం గమనార్హం. 49 ఏళ్లగా నిర్వహిస్తున్న ఈ జాతర వివరాలు ప్రజలకు తెలపడంలో మీడియా ప్రధాన పాత్ర వహిస్తుంది. కానీ ఈ సంవత్సరం జాతర ఫలానా రోజు జరుగుతుందన్న ఒక విషయం తప్ప మరే వివరాలు మీడియాకు తెలపకపోవడంలో ఈవో శశాంక్ నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోంది. ప్రజల కోసం జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్య బాధ్యత వహించాల్సిన ఈవో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఇష్ట రాజ్యంగా వ్యవహ రిస్తున్న ఇలాంటి వాళ్లకి బాధ్యతలు అప్పగించడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పై స్థాయి అధికారులు దీనిపై పూర్తి విచారణ చేపట్టి ప్రజా ధనంతో ప్రజల కోసం చేపడుతున్న ఇలాంటి కార్యక్ర మాలకు ఇటువంటి వారిని దూరంగా పెట్టాలని, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు అతనిపై చర్యలు చేపట్టాలని నాయుడుపేట ప్రజలు కోరుతున్నారు.

రేపు వేయిలింగేశ్వరస్వామి తిరునాళ్లు

ప్రజాశక్తి - దక్కిలి:

మండలంలోని కొలితోట వేయిలింగేశ్వర స్వామి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఏ శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా స్వామి వారి గ్రామోత్స వం, అన్నదానం, సాయంత్రం శివపార్వతుల కళ్యాణోత్సవం, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా భక్తులు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో తెలిపారు. ముందస్తు ఏర్పాట్లు చేశామని వివరించారు.

క్రైం న్యూస్

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

పెంచలకోన సమీపంలోని రాపూరు వద్ద 16 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక టెంపోట్రావెలర్, కారును టాస్క్ ఫోర్సు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు డిఎస్పి చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఐ (రిజర్వు) కే సురేష్ కుమార్ రెడ్డికి ఆధీనంలోని ఆర్ఎస్ఐలు కేఎస్ కే లింగాధర్, కే సురేష్ బాబు బృందాలు శుక్రవారం సాయంత్రం తిరుపతి నుంచి రాపూరు మధ్య ఉన్న లోడింగ్, డంపింగ్ పాయింట్లను తనిఖీ చేస్తుండగా రాపూరు నుంచి ఎగువపల్లి అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారు జామున రెండు వాహనాలు అనుమానాస్పదంగా కనిపించాయన్నారు. వాహనాల్లో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండంతో వారిని చుట్టు ముట్టడానికి ప్రయత్నించి నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నమన్నారు. వారిని తమిళనాడు తిరువన్నామలైకు చెందిన అన్బళగన్ (41), చిత్తూరు టౌన్‌కు చెందిన అసిఫ్ బాషా (21), ముత్తు (33), సెల్వం (30)లుగా గుర్తించారు. వీరి నుంచి 16 ఎర్రచందనం దుంగలు, ఒక టెంపో ట్రావెలర్, కారు, మూడు ఫాస్టాగ్‌లు, 3 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. వీరిపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఎస్ఐ సీహెచ్ రఫీ దర్యాప్తు చేస్తున్నారన్నారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ రూ.40 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సాహసోపేత ఆపరేషన్లలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్ సిబ్బందికి రివార్డులు ఇవ్వాలని సిఫార్సు చేశామని తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తప్పి పోయిన బాలుడిని అలిపిరి పోలీసులు తల్లిదండ్రులకు క్షేమంగా శనివారం అప్పగించారు. తూర్పు గోదావరి జిల్లా మొగల్తూరు కు చెందిన వినయ్ మణికంఠ (6) తల్లిదండ్రులతో పాటు తిరుమల శ్రీవారి దర్శనానికి, శనివారం అలిపిరి పాదాల మండపం వద్ద తప్పిపోయాడు. బాలుడు మిస్సింగ్ అయిన విషయం తెలిసిన అలిపిరి పోలీసులు వెతుకులాట ప్రారంభించారు. లింక్ బస్టాండ్ వద్ద బాలుడిని గుర్తించిన అలిపిరి పోలీసులు, వాళ్ల తీసుకొని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. తమ బిడ్డలకు కాపాడిన పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


నూకతోటి రాజేష్‌ను కలిసిన వైసిపి నాయకులు

వైసిపి అభ్యర్థిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:

సత్యవేడు నియోజక వర్గ వైసీపీ అభ్యర్థి నూక తోటి రాజేష్‌ను నియోజక వర్గం లోని బుచ్చి నాయు డు కండ్రిగ నాయకులు భాస్కర్ రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, దేవదాస్ రెడ్డి ఇమామ్ బాషా కలిశారు. ఈ నెల 14వ తేదీ నుండి, నేటి వరకు భారీ సంఖ్యలో నాయకులు నూక తోటి రాజేష్ ఇంటికి వెళ్లి అభినందనలు తెలుపుతున్నారు. దీంతో తిరుపతిలోని ఆయన ఇల్లు పది రోజులుగా వైసీపీ నాయకులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నూక తోటి రాజేష్ ను, తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా మద్దెల గురుమూర్తిని భారీ మెజార్టీతో గెలిపించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇస్తామని తెలిపారు. వైసిపి 175కి 160 స్థానాలు గెలిచి మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు.



ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న నీటి యాజమాన్య సంస్థ జిల్లా సంచాలకులు శ్రీనివాస ప్రసాద్

కూలీలకు వసతులు కల్పించాలి

- డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి -బాలాయపల్లి:

ఉపాధి హామీ పనుల్లో కూలీలకు అన్ని వసతు లు కల్పించాలని నీటి యాజమాన్య సంస్థ జిల్లా సంచాలకులు శ్రీని వాస ప్రసాద్ అన్నా రు. మండ లంలోని జయం పు గ్రామంలో శనివారం మినీ అమృత్ సరోవర్ పనులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం వచ్చేలా రోజు వారి కూలి మూడు వందల రూపాయలు అందేలా చూడాలన్నారు. అమృత సరోవరం గుంతలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఈ గుంతలో నీళ్లు పశువులకు, పక్షులకు ఎండల కాలంలో చాలా ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న రిజిస్టర్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీవో ఎస్. మృత్యుంజయ రావు, ఈసీ కరుణాకర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, బీఎఫ్టీలు, ఉపాధి సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.